
ప్రజాశక్తి
గురువారం 18 జులై 2024
5
పార్వతీపురం మన్యం



ఎమ్మెల్యేను కలిసిన డిసిసిబి బ్యాంకు సిఇఒ

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక ఎమ్మెల్యేగా ఎన్నికైన నిమ్మక జయకృష్ణను శ్రీకాకుళం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సిఇఒ డి.వరప్రసాద్ పాలకొండలో బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీల ద్వారా రైతులకు అందుతున్న రుణాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న డిసిసిబి సిఇఒ

కాలువల్లో పేరుకుపోయిన పూడికలు

అంతంత మాత్రంగా సాగునీరు

ఇదీ జంఝావతి ప్రాజెక్టు ఆయకట్టు రైతుల దుస్థితి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో గల జంఝావతి ప్రాజెక్టు ద్వారా ఈ ఖరీఫ్‌కు సాగునీటి సరఫరాపై రైతులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా ప్రాజెక్టు చివరి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించే పరిస్థితి లేదు. అనేక ఏళ్లుగా కుడి కాలువల ద్వారా చుక్కనీరు అందడంలేదని రైతులు వాపోతున్నారు. ఇక ఎడమ కాలువ ద్వారా మండలంలోని విక్రాంపురం, పార్వతీపురం మండలం కొత్తవలస ఆయా ప్రాంతాల రైతులకే కొంతమేరకు సాగునీరందుతుంది. ప్రతి ఏటా తూతూ మాత్రంగానే కాలువలు తడిసేల నీరు వదిలి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. పూర్తిస్థాయిలో రైతులకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో కాలువలో పేరుకుపోయిన పూడికలు, చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో కాలువ చివరి ఆయకట్టు రైతులకు నీరందడం లేదని రైతులంటున్నారు. కుడి కాలువ పనులు పూర్తికాకపోవడంతో ఆ కాలువకు కనీసం చుక్కనీరు కూడా వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు.

మండలంలోని రాజ్యలక్ష్మి పురం సమీపంలో వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు జంఝావతి ప్రాజెక్టును 1976లో నిర్మించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 24,600 ఎకరాలకు సాగునీరుందివచ్చు. కానీ ఒడిస్సాతో ఉన్న చిన్న వివాదం వల్ల పనులు సగంలో నిలిచిపోయాయి. దీంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాకుండా, ఎగువ కాలువ తవ్వకాలు పూర్తికానప్పటికీ 2006లో రబ్బరుడ్యామ్, ఎత్తిపోతల పథకం పేరుతో కొంతమేరకే మాత్రమే సాగునీరు అందుతుందని చెప్పవచ్చు. రబ్బరుడ్యామ్ ద్వారా 12 వేల, ఎత్తిపోతల పథకం ద్వార 12 వేల ఎకరాలకు సాగునీరందిస్తామని అధికారులు చెబుతున్నా గత ఐదేళ్లుగా ఎడమ కాలువ ద్వారా కేవలం 4వేల ఎకరాలకు మాత్రమే సాగునీరుందించారు. ఎత్తిపోతల పథకం ద్వారా 12వేల ఎకరాలకు గానూ కేవలం 300 ఎకరాలకు మాత్రమే సాగునీరందిస్తున్నారు. పెద్ద పెద్ద ప్రాజెక్టు నిర్మాణాలకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు తప్ప కనీసం చిన్న సమస్యలు పట్టించుకోకపోవడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం ఉన్నందున చర్చలు జరిపితే జంఝావతి ప్రాజెక్టు సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఈ ప్రాంత రైతులు అంటున్నారు. అంతవరకు ప్రస్తుతం ఉన్న ఎడమ కుడి కాలువల ద్వారా పూర్తిస్థాయిలో నీరు అందిస్తే కొంతమేరకు రైతులకు సాగునీరు అందుతుందని రైతులు అంటున్నారు. తక్షణమే అధికారంలోకి వచ్చిన ఉమ్మడి ప్రభుత్వం కాలువలు ఆధునీకరణ పనులు పూర్తి చేస్తే 24వేల ఎకరాలకు సక్రమంగా సాగునీరందించేందుకు అవకాశాలు ఉన్నాయని, ఈ ప్రాంత రైతులు అంటున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు అవసరమైంత వరకు కాలువల ద్వారా సాగునీరందించేలా చర్యలు చేపట్టాలని, కాలువల్లో పూడికలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.


అరకొరగా సాగునీరు వస్తున్న లోలెవెల్ కాలువ

రైతు సంక్షేమ ప్రభుత్వ ధ్యేయమని, రైతే రాజని... దేశానికి వెన్నుముకని అంటూ వార్డు మెంబరు నుంచి ప్రధానిమంత్రి వరకు రైతు గురించి గొప్పగా ఉపన్యాసాలు ఇవ్వడమే తప్ప వారి సమస్యలను పట్టించుకున్న దాఖలాల్లేవు. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వాలని, సకాలంలో ఎరువులు, పురుగులు మందులు అందజేయాలని, సాగునీరందించి ఆదుకోవాలని నిత్యం పాలకులను అన్నదాత వేడుకున్నాడు. అయితే పాలకులు తమకేమీ పట్టనట్టు చెవిటివాని ముందు శంఖం ఊదిన చందాన వ్యవహరిస్తున్నారు. దీంతో అనేక మంది రైతులు వ్యవసాయ దండగని ఉపాధి కోసం వలసలు పోగా, మరికొంతమంది అనాదిగా వస్తున్న వ్యవసాయాన్ని వదులుకోలేక నష్టాలబారినపడి అప్పల పాలై ఆత్మహత్యలకు పాల్పడిన సందర్భాలు అనేకం. మన్యం జిల్లాలో సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నా రైతులకు సాగునీరందించడంలో పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. కొన్నిచోట్ల ప్రాజెక్టులు అసంపూర్తి కాకపోగా, మరికొన్ని చోట్ల సాగునీటి కాలువ నిర్వహణ పట్టించుకోవడం. దీంతో కాలువల్లో పిచ్చిమొక్కలు పేరుకుపోయి సకాలంలో రైతులకు సాగునీరందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇందుకు నిదర్శనం జంఝావతి ప్రాజెక్టు కాలువ పరిస్థితే.

నిధులు కేటాయిస్తే పుష్కలంగా సాగునీరు

ఎడమ కాలువ ద్వారా కొంతమేరకు పార్వతీపురం, సీతానగరం మండలాలకు సాగునీరు వెళ్తున్నా, కుడి కాలువ పనులు పూర్తిగా సాగునీరు సరఫరా కాకపోవడంతో గంగభద్ర గ్రామం వద్ద సీల్టు తీసేందుకు గత పదేళ్లుగా అధికారులు చర్యలు చేపట్టినా ఫలితం శూన్యం. పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తే రబ్బరు డ్యామ్ ద్వారా రెండు కాలువల ద్వారా 24వేల ఎకరాలకు సాగునీరందించేందుకు అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఆ దిశగా రెండు కాలువల నిర్మాణం జరిగితే ఒడిశా ప్రభుత్వంతో సంబంధం లేకుండా పూర్తి స్థాయిలో సాగునీరందించేందుకు అవకాశం ఉందని రైతు సంఘాల నేతలు అంటున్నారు.

మన్యంలో వైద్యం నామమాత్రం

- ప్రబలుతున్న మలేరియా, టైఫాయిడ్
- పూర్తిస్థాయిలో అందుబాటులో లేని ప్రత్యేక వైద్య శిబిరాలు
- అవస్థలు పడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంతో పాటు ఏజెన్సీలోని అన్ని గ్రామాల్లో జ్వరాల తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. వర్షాలు, వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా గ్రామాల్లో జ్వర పీడితులు ఎక్కువయ్యారు. ప్రతి ఇంటికీ ఇద్దరు, ముగ్గురు జ్వరం బారిన పడుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఒక్కసారిగా జ్వరాలు ఎక్కువ కావడంవల్ల ఏజెన్సీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. రోగులు ఎక్కువ మంది కావడంతో ఒక బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు రోగులకు వైద్యం అందిస్తున్నారు. ఇదే అవకాశం చేసుకున్న ఆర్ఎంపి వైద్యులు ఏజెన్సీ ప్రజల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. సాధారణ జ్వరమైనప్పటికీ అనేక రకాల పరీక్షలు నిర్వహించి వేలకు వేలు బిల్లులు వేస్తున్నారు. అవసరం లేకపోయినా వివిధ రకాల పేర్లతో పరీక్షలు జరిపి ప్రయివేటు ల్యాబ్ నిర్వాహకులు వేల రూపాయలు ఫీజు తీసుకుంటున్నారు. రోగనిర్ధారణ పేరిట గిరిజనులను నిలువునా దోచుకుంటున్నారు. గ్రామాల్లోకి వెళ్లి సేవలు అందించాల్సిన వైద్య సిబ్బంది తూతూ మంత్రంగా వ్యవహరిస్తుండటం, ముందస్తు శానిటేషన్ చర్యలు చేపట్టక పోవడం, జ్వరాలపై అవగాహన కల్పించకపోవడంతో ఆర్ఎంపి వైద్యులు భారీగా వ్యాపారం చేసుకుంటున్నారు. ఆర్ఎంపి వైద్యశాలతో పాటు ప్రతి వైద్యశాల కిక్కిరిసిపోయి ఉండడం ఏజెన్సీ గ్రామాల్లోని జ్వరాల తీవ్రతకు అద్దంపడుతుంది. ఇక్కడ నుంచి పార్వతీపురం ప్రైవేట్ వైద్యశాలలకు రోగులు వెళ్తున్నారు. గ్రామాల్లో ఒకే ఇంట్లో ఇద్దరు లేక ముగ్గురు జ్వరంతో బాధ పడుతుండడంతో వారి ఉపాధికి కూడా ఆటంకంగా మారింది. అధికారులు వెంటనే స్పందించి గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అధిక నగదు వసూలు చేస్తున్న వారిపై సంబంధిత జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.


కురుపాం సిహెచ్ లో ఒకే బెడ్ పై చికిత్స పొందుతున్న ముగ్గురు, ఇద్దరేసి రోగులు

గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనులు మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల తీవ్రతతో ఎక్కువగా బాధపడుతున్నారు. ప్రభుత్వ సేవలు సక్రమంగా అందకపోవడంతో ఆర్ఎంపి వైద్యులు ఆశ్రయించి వేలాది రూపాయలు తగలబెట్టి ప్రాణాల మీదకు తెచ్చుకుంటు న్నారు. కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గిరిజనులకు మెరుగైన వైద్యం అందించి ప్రాణాలను కాపాడాలి.



కోలక అవినాష్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి.

అన్ని గ్రామాల్లో స్ప్రేయింగ్ చేపట్టాలి

వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాల తీవ్రత ఎక్కువ ఉండడంతో ం వైద్య సిబ్బంది అన్ని గ్రామాల్లో మలాథియన్ స్ప్రేయింగ్ చేపట్టాలి. వైద్య సిబ్బంది కొన్ని గ్రామాల్లోనే స్ప్రేయింగ్ చేపట్టడం సమంజసం కాదు. వైద్య సిబ్బంది తక్షణమే స్పందించి మలాథియన్ స్ప్రేయింగ్ చేపట్టి దోమలను నివారించి ప్రజలు జ్వరాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి.



ఎం.అడ్డమేశ్వరరావు, మాజీ ఎంపిటిసి, వబ్బంగి పంచాయతీ.

వైసిపి పాలనలో అవినీతి, అక్రమాలు

కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైసిపి ఐదేళ్ల పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీలపై ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రాలను విడుదల చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే యడం జరుగుతుందనీ నియోజకవర్గం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసిపి పాలకులు ఏ విధంగా అక్రమాలు, దందాలు చేశారో, ఎంత దోచుకున్నారో ఆధారాలతో సహా శ్వేతపత్రాల ద్వారా ప్రభుత్వం బయటపెడుతుందన్నారు. దాదాపు 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలు జరిగాయని, వాటి విలువ రూ.35,576 కోట్లు పైనే ఉందన్నారు. అలాగే ఇళ్ల పట్టాల పేరుతో 10 వేల ఎకరాలు, ఇసుక దందాలో రూ.9,750 కోట్ల దోచుకున్నారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ రద్దు చేయడం జరిగిందని అన్నారు . ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో వైసిపి నేతలు భూదోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు. ప్రైవేటు వ్యక్తిని ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్‌గా నియమించి పేద ప్రజల భూములను కొట్టేయాలని పన్నాగం పన్నారని ఆరోపించారు. ఇంతటి ప్రమాదకరమైన చట్టాన్ని దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాలు సైతం అమలు చేయలేదన్నారు. కానీ నల్ల చట్టంలోని లొసుగులను గ్రహించిన జగన్ రెడ్డి ప్రభుత్వం జీవో 512ను జారీ చేసి అక్రమాలను సక్రమంగా మార్చే ఆయుధంగా వాడుకున్నారని విమర్శించారు. హౌసింగ్ కాలనీ ఎక్కడ రావాలో వైసిపి నేతలే నిర్ణయించేవారని, అందుకు ముందే స్థలం కొని తిరిగి ప్రభుత్వానికి అధిక రేటుకు అమ్మి అనేక రెట్ల పరిహారం కొట్టేశారని ఆరోపించారు. తక్కువ ధరకు రైతుల నుంచి భూములను కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ప్రభుత్వానికి ఇళ్ల స్థలాల కోసం అమ్మిన వైసిపి నేతల భాగోతాల గురించి సాక్ష్యాధారాలతో సహా శ్వేతపత్రంలో పొందుపర్చారని తెలిపారు. ఇళ్ల పట్టాల్లో వైసిపి నేతలు ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. వీరి దగ్గర నుంచి ప్రతీ రూపాయి వసూలు చేసి ప్రజా ఖజానాకు జమకడుతామని చెప్పారు.

పక్కాగా ఎల్‌సిడిసి సర్వే

ప్రజాశక్తి - వీరఘట్టం

ఎల్‌సిడిసి సర్వే పక్కాగా నిర్వహించాలని స్థానిక వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రోజుకు 20 ఇళ్లను సందర్శించాలన్నారు. అనుమానం వచ్చిన వ్యక్తులకు తప్పనిసరిగా సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జనార్దన్ రావు, శాంత కుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశ ప్రయోజనాలకు నష్టం చేసే మోడీ విధానాలపై

లౌకిక శక్తులు బలపడాలి

బిజెపితో స్నేహం రాష్ట్రానికి ప్రమాదకరం

సిపిఎం విస్తృత సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

దేశ ప్రయోజనాలకు నష్టం చేసే బిజెపి విధానాలపై లౌకిక శక్తులు బలపడాలని, బిజెపితో ప్రాంతీయ పార్టీల స్నేహం రాష్ట్రానికే ప్రమాదకరమని సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ హెచ్చరించారు. సిపిఎం విస్తృతస్థాయి జిల్లా సమావేశం స్థానిక సుందరయ్య భవనంలో బుధవారం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.మన్మధరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల్లో బిజెపికి గణనీయమైన రీతిలో ఎదురు దెబ్బలు తగిలిందన్నారు. 400 సీట్లు సాధిస్తామన్న బిజెపి 240 స్థానాలకు పరిమితమైందన్నారు. ఇది దేశంలో లౌకిక ప్రజాస్వామిక శక్తులు, పోరాడే వామపక్ష ప్రజాసంఘాల పోరాట విజయంగా భావించాలని తెలిపారు. ఇండియా కూటమి 234 సీట్లు సాధించి మెజారిటీకి అతి చెరువలోకి వచ్చిందని, ఇది ప్రజాతంత్ర శక్తుల విజయమని అభివర్ణించారు. సిపిఎం ఎన్నికల పంథాలో భాగంగా బిజెపిని రాజకీయంగా ఒంటరి పాటు చేసి ఓడించాలనినే ప్రధాన లక్ష్యానికి చెరువగా వచ్చిందని తెలిపారు. అయితే బిజెపి మతోన్మాద కార్పొరేషన్ ఎజెండాను స్వల్ప మెజారిటీతో ఉన్న ఆర్ఎస్ఎస్ అజెండాను ముందుకు తీసుకువెళ్లాలని చూస్తుందన్ని దీనికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాల ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. మన రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు బిజెపి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం రాష్ట్రానికి తీరని నష్టమన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రాంతీయ పార్టీలు లొంగుబాటు ధోరణితో రాష్ట్రానికి నష్టం జరుగుతుంది. ప్రత్యేక హెూదా, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు, గిరిజన యూనివర్సిటీ, పోలవరానికి నిధులు ఇవ్వాలనే డిమాండ్ చేయలేదని, కేంద్రం ముందు చేతులు కట్టుకొని నిలబడటమే తప్ప రాష్ట్ర ప్రయోజనాలు గాలికి వదలడం సరైంది కాదని అన్నారు. మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేక పార్టీలుపోరాడాలని ఆమె కోరారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ జిల్లాలో బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ఎన్నికల పోరాటంలో అరకు పార్లమెంట్లో దాన్ని ఓడించిందన్నారు. కురుపాం నియోజకవర్గంలో సిపిఎం అభ్యర్థికి ఓట్లు వేసి మద్దతు ఇచ్చి గిరిజన ప్రాంత ప్రయోజనాలను, సిపిఎం పోరాటాలను బలపరిచి ఓట్లు వేసిన ప్రజలందరూ అధికారంలోకి వచ్చిన పార్టీలు ఇచ్చిన హామీలు అమలుకు ఐక్యంగా పోరాడాలని కోరారు. అధికారంలోకి వచ్చిన టిడిపి జిల్లాలో ఉద్యోగులపైన రాజకీయ వేధింపులు ఆపాలని, లేనిచో ఆయా వర్గాలతో కలిసి ఆందోళన పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం సమావేశంలో జిల్లా సమస్యలపై ప్రవేశపెట్టిన పలు తీర్మానాలు ఆమోదించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు కె.గంగు నాయుడు, వి.ఇందిరా, ఎం.తిరుపతిరావు, సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు, పలువురు మండలాల కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుబ్బరావమ్మ

తీర్మానాలు

- శివ్వాందళితులపై దాడి చేసిన పెత్తందారులను అరెస్టు చేయాలి. దళితుల భూమి వారికి అప్పగించాలి. రెవెన్యూ భూ సమస్యల్లో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.
- జిల్లాలో జంఝావతి ప్రాజెక్టు పూర్తి చేయాలి. తోటపల్లి ప్రాజెక్టు ద్వారా పాలకొండ చివర భూములకు సాగునీరందించాలి. గుమ్మడి గెడ్డ, చిన్న చిన్న గెడ్డలపైనా, జంపర్ కోట, పెదగెడ్డ పెండింగ్ నీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలి.
- జిల్లాలో వర్షాలు, వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యం వల్ల గిరిజన ప్రాంతం జిల్లా అంతా జ్వరాలు వ్యాధులు విస్తరిస్తున్నాయి. కావున ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులో పెట్టాలి. వెంటనే జిల్లాలో మెడికల్ కాలేజ్ నిర్మాణం, సీతంపేట, సాలూరులో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం చేపట్టాలి. మలేరియా జ్వరాలకు సరిపడా మందులు ఇవ్వాలి. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో జనరిక్ మెడికల్ షాపులు ప్రారంభించాలి. వైద్య సిబ్బందిని నియమించాలి.

జిపిఎస్ రద్దా, ఒపిఎస్ కావాలా?

ప్రభుత్వ ఉద్యోగులకు మాజీ డిప్యూటీ సిఎం ప్రశ్న

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జిపిఎస్ రద్దు కావాలా? ఒపిఎస్ పునరుద్ధరణ కావాలా? అని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర ప్రశ్నించారు. బుధవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులు వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేశారనేది జగమెరిగిన సత్యమని అన్నారు. సిపిఎస్ రద్దు చేయకుండా జిపిఎస్‌ను తెరపైకి తీసుకొచ్చారని వైసిపి ప్రభుత్వాన్ని ఉద్యోగులు వ్యతిరేకించారని చెప్పారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి ప్రభుత్వం జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంతో ఉద్యోగ సంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో టిడిపి ప్రభుత్వం వెంటనే జిపిఎస్ నోటిఫికేషన్‌ను నిలిపివేసి నట్లు ప్రకటించిందని చెప్పారు. అయితే జిపిఎస్ నోటిఫికేషన్ రద్దు చేస్తూ మంత్రివర్గం తీర్మానం చేయలేదని చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ మంత్రివర్గం తీర్మానం చేసినట్లుగా జిపిఎస్ నోటిఫికేషన్ రద్దు చేస్తూ ఎందుకు తీర్మానం చేయలేదో ప్రభుత్వ ఉద్యోగులు ఆలోచించుకోవాలని సూచించారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ పునరుద్ధరణ చేస్తే రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కి పోతుందని లోక్ సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ చెప్పారని తెలిపారు. జెపి సలహాలు, సూచనలను అమలు చేసే టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులు కోరుకున్న ఒపిఎస్ పునరుద్ధరణ ఏ మేరకు సాధ్యమవుతుందనేది వేచి చూడాల్సిందే నని రాజన్నదొర చెప్పారు.

కూలిన హైస్కూల్ ప్రహరీ

ప్రజాశక్తి -భామిని

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆటస్థలానికి ఆనుకొని ఉన్న ప్రహరీ గోడ మంగళవారం రాత్రి కూలింది. రాత్రి పూట గోడ కూలడంతో ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. కూలిన గోడ సమీపంలో బాలికల మరుగుదొడ్లు ఉన్నాయి. పాఠశాలలో చదివే బాలికలకు ఇబ్బంది కలగకుండా, మళ్లీ ప్రహరీ గోడ నిర్మించాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు.


కూలిపోయిన పాఠశాల ప్రహరీగోడ

'ఉపాధి'లో అవినీతిపై విచారణ చేపట్టాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మన్యం జిల్లాలో ఉపాధి హామీ చట్టం ద్వారా చేసిన పనుల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి ఈశ్వరరావు, కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఉపాధి హామీ పనుల్లో డ్వామా పీడీ దగ్గర నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ వరకు విచ్చలవిడిగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో ఉన్న ఉపాధి అధికారులందరికీ ఈ అవినీతి, అక్రమాల్లో సంబంధం ఉందని, అయితే కేవలం క్షేత్ర స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లపై మాత్రమే అవినీతికి పాల్పడుతున్నట్లు కొన్నిచోట్ల టిడిపి నాయకత్వం కక్ష కట్టి తమ అనుయాయులతో ఫిర్యాదులు చేయించి తొలగిస్తున్నారని అన్నారు. ఇది దుర్మార్గమని, పనులు జరుగుతున్న సందర్భంలో ప్రతి కూలి వద్ద ఒక వారానికి వంద రూపాయలు చొప్పున వసూలు చేస్తున్నారని, ఫీల్డ్ సిబ్బందితో వసూళ్లు చేయించి ఎక్కువ శాతం డబ్బులు టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా ఎపిఒలకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారుల ద్వారా డ్వామా పీడీ వరకు చేరుతున్నాయని విమర్శించారు. కింది స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వాటాలు వెళ్తున్నాయని, కాబట్టే ఇంత విచ్చల విడిగా గత నాలుగైదు ఏళ్ల నుంచి అవినీతికి పాల్పడుతున్నార ని అన్నారు. ఇలా ఒక మండలానికి ఏడాదిలో సుమారు రూ.20 కోట్లు వరకు వేతన దారులు నుండి వసూళ్లు చేస్తున్నారని అన్నారు. జిల్లాలో ఏడాదికి రూ.300 కోట్లు అవినీతి జరుగుతుందన్నారు. ఎక్కడైనా వేతనదారులు వంద రూపాయిలు ఇవ్వనంటే మీకు కూలీ సరిగ్గా వేయమని, తక్కువ కొలతలు వేస్తామని బెదిరిస్తున్నారని అన్నారు. పాలకొండ నియోజకవర్గంలో కింది స్థాయి అధికారులు డబ్బులు వసూళ్లు చేయడానికి ఇష్టపడకపోతే వారిని జిల్లా కేంద్రం నుంచి అధికారులు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఇవే కాకుండా ఫీల్డ్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో గ్రామాల్లో లేని వారి పేర్లు, వలసలు వెళ్లిన వారి పేరున, పార్వతీ పురం, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగ రీత్యా ప్రభుత్వ, ప్రవేట్ ఉద్యోగాలు చేసుకుంటూ స్థిరపడిన వారి పేరున లక్షలాది రూపాయలు బిల్లులు చేసి స్వాహా చేస్తున్నారన్నారు. విద్యార్థుల పేరున కూడా గత ఏడాది జియ్యమ్మవలస మండల కేంద్రంలో మస్తర్ వేసి బిల్లులు డ్రా చేశారని గుర్తు చేశారు. దీనిపై ఫిర్యాదు చేశామని, విచారణలో ఫీల్డ్ అసిస్టెంట్‌ను తీసివేశారని అన్నారు. అయితే పనులను పర్యవేక్షించాల్సిన ఎపిఒ, టెక్నికల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లుపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇంత విచ్చల విడిగా అవినీతి జరిగితే కొత్తగా అధికారంలోకి వచ్చిన టిడిపి నాయకులు వారికి ఇష్టం లేని ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటున్నారని, ఇది దుర్మార్గమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలంటే జిల్లా స్థాయి అధికారిని విచారణ అధికారిగా నియమించి ఉపాధి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న రోజుల్లో కూలీలను కదిలించి పోరాటం చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మద్రి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు సింహాచలం, గరుగుబిల్లి శ్రీనివాసరావు, పిట్టల సీతారాం, వెంకట స్వామి, పాలమెట్ల రాము



సమావేశంలో మాట్లాడుతున్న గంగునాయుడు

మహిళల ఆర్థికాభివృద్ధికి శిక్షణ దోహదం

ప్రజాశక్తి - సీతంపేట

వంవిాళా రైతులు ఆర్థికంగా బలోపేతం కావడానికి శిక్షణలో ఎంతో దోహదపడ తాయని తహశీల్దార్ మహేశ్వర రావు అన్నారు. మండలంలోని ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివాసీ మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ, నాబార్డ్ సహకారంతో 750 మంది మహిళా రైతులతో రెండేళ్లుగా విజయవంతంగా నిర్వహిస్తున్నామని ఎఫ్‌బిఒ గౌతమి అన్నారు. వివిధ రకాల ఆటవీ ఉత్పత్తులతో విలువ ఆధారిత వస్తువుల తయారీపై మహిళా రైతులకు శిక్షణా నిర్వహించబడుతున్నామచెప్పారు. అందులో భాగంగా వారం రోజుల పాటు వివిధ రకాల కొండ చీపురుల తయారీ పై మండలానికి చెందిన 15 మంది మహిళా రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి మహిళా రైతులను ఆర్థికంగా మరింత బలోపేతం చేస్తామన్నారు. ఇందుకు తగినంత సహకారం ఎల్లప్పుడు ఉంటుందని తెలిపారు. కార్యక్రమములో మండల ఆర్ఐ వెంకటేష్, ఐటిడిపి ఇంచార్జ్ ఇమరక పవన్, మండల టిడిపి అధ్యక్షులు సవర తోటముఖలింగం, రైతులు, అధికారులు పాల్గొన్నారు.


చీపుర్ల తయారీలో శిక్షణ పొందుతున్న గిరిజన మహిళా రైతులు



తురకనాయుడువలసలో ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజలకు రుణపడి ఉంటా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా ఎవరికీ ఇవ్వని మెజారిటీతో గొప్ప విజయాన్ని అందించిన ప్రతి కుటుంబానికి రుణపడి ఉంటానని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం ఆమె తురకనాయుడువలసలో అరకు పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్ ఆధ్వర్యంలో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే నియోజకవర్గంలోని ప్రతి సమస్యను తెలుసుకుని వాటిని తక్షణ పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకుంటారని, ఈ విషయంలో ఏ ఒక్కరూ అబద్ధాలు నమ్మొద్దని ఆమె తెలిపారు. కార్యక్రమం టిడిపి నాయకులు గురాన శ్రీరామ్మూర్తి, జోగి భుజంగరావు, మరడ శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ పోతుల నాగమణి, జనసేన నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న క్లాప్ డ్రైవర్లు

కొనసాగుతున్న క్లాప్ డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

తమకు బకాయిపడ్డ మూడు నెలల వేతనాలు, 7 నెలల పిఎఫ్ చెల్లించాలని చెత్త సేకరణ వాహనాల డ్రైవర్లు బుధవారం కూడా విధులకు హాజరు కాకుండా మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ డ్రైవర్లకు బకాయివేతనాలు, పిఎఫ్ చెల్లించాలని, లేకుంటే ఆందోళనను కొసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్లు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సిహెచ్ సింహాచలం, బంగారు రవి,తదితరులు పాల్గొన్నారు.



మేళాలో ఎంపికైన అభ్యర్థులు

భాస్కర్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి- పార్వతీపురం

స్థానిక భాస్కర్ డిగ్రీ కళాశాలలో బుధవారం మెగా జాబు మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల డైరెక్టర్ బొంతు శ్రీనివాసరావు మాట్లాడుతూ వర్క్ రూట్ ఆర్గనైజేషన్ వారి సౌజన్యంతో ఈ జాబ్ మేళా తమ కాలేజీ నిర్వహించామన్నారు. ఈ మేళాకు వివిధ డిగ్రీ కళాశాలల నుంచి 400 వరకు హాజరయ్యారన్నారు. వీరిలో 110 మంది ఎంపికయ్యారని తెలిపారు. డిగ్రీలు చేసి ఉద్యోగ అవకాశాలు పొందేందుకు వర్క్ రూట్ లాంటి సంస్థ తమ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడాన్ని ఆర్గనైజేషన్‌ను ఆయన అభినందించారు. వర్క్ రూట్ కన్వీనర్ గంగాధర్, కోఆర్డినేటర్ నల్ల సురేష్, భాస్కర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.రవిశాస్త్రి, వివిధ కంపెనీల ప్రతినిధులు, పాల్గొన్నారు. జాబ్ మేళా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించిన వర్క్ రూట్ ఆర్గనైజేషన్‌కు భాస్కర్ డిగ్రీ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపారు.



అధ్వానంగా ఉన్న వీరాడవలసకు వెళ్లే రోడ్డు

అధ్వానంగా బట్టివలస- వీరాడవలస రహదారి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఎస్.పెద్దవలస, మార్కొండ పుట్టి పంచాయతీ పరిధిలో గల గిరిజన గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వాన్నంగా తయారయ్యాయి. చుట్టూ పక్కల గిరిజన గ్రామాల్లో లింక్ రోడ్లు కోసం ఆయా గిరిజనులు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా తమ గ్రామానికి ఈసారైనా రోడ్డు వస్తుందని గిరిజనులు ఎదురు చూస్తున్నారు. శంబర చుట్టుపక్కల గిరిజన గ్రామాలైన బట్టివలస, కవిరివలస, వీరాడవలస గ్రామాల గుండా నిత్యం మార్కొండపుట్టి నుంచి శంబర వరకు ప్రజలు ప్రయాణిస్తుంటారు. ప్రతి ఏటా శంబర యాత్రకు మొక్కిబడిగా గోతులు పూడ్చడం, ఆ తర్వాత వదిలేయడం జరుగుతూనే ఉంది. రోడ్లు లేని గిరిజన గ్రామాలు సాలూరు నియోజకవర్గంలో చాలా ఉన్నాయి. కావున గిరిజన గ్రామాలన్నింటిని గుర్తించి రోడ్లు వేయాలని గిరిజన సంఘాల నాయకులు టి.సాయిప్రభాకర్ తదితరులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే గిరిజన ప్రాంత రహదారులపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

జిల్లా కళింగ వైశ్య సభ్యులకు రాష్ట్ర కమిటీలో చోటు కల్పించాలి

ప్రజాశక్తి -భామిని

రాష్ట్ర కళింగ వైశ్య కమిటీలో పార్వతీపురం జిల్లా వాసులకు అవకాశం కల్పించడం ద్వారా ఉమ్మడి ప్రభుత్వ ప్రతి ఫలాలు పూర్తి స్థాయిలో జిల్లా కళింగ వైశ్య కుటుంబాలకు చేరుతాయని టిడిపి బిసి సాధికారక జిల్లా కన్వీనర్ కోరాడ రాజేష్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. బుధవారం పార్వతీపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కళింగ వైశ్య కుటుంబాలు సంక్షేమానికి వైశ్య సంఘం కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా కళింగ వైశ్య సంఘం రాజేష్‌ను సంఘం ట్రెజరర్ గా ఎన్నుకుని, సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్



రావికోనలో గిరిజన ఆశ్రమ పాఠశాల

విద్యార్థులు జాస్తి వసతులు నాస్తి

ఇవీ మండలంలో వసతి గృహాల పరిస్థితి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

మండలంలో రెండు గిరిజన సంక్షేమ వసతిగృహాలతో పాటు ఒక బిసి వసతి గృహం ఉంది. ఈ వసతి గృహాల్లో ఇబ్బడి ముబ్బడిగా విద్యార్థులున్నప్పటికీ వారికి సరిపడే వసతుల్లేవు. దీంతో వసతిగృహం అన్న మాటకే అర్థం మారిపోతుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. మండలంలోని డోకిశీల, రావికోన గ్రామాల్లో ఐటిడిఎ పరిధిలో గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలకు అనుసంధానంగా వసతి గృహాలు ఉన్నాయి. డోకిశీల హాస్టల్‌లో 230కి పైగా విద్యార్థులు, రావికోనలో 175 మంది విద్యార్థులు ఉండగా నర్సిపురంలోని బిసి సంక్షేమ హాస్టల్‌లో 75 మంది విద్యార్థులు ఉన్నారు. రావికోన హాస్టల్‌లో కేవలం విద్యార్థుల కోసం నాలుగు గదులే ఉండడంతో వారు చదువుకుంటున్న స్థలంలోనే తమ సామాన్లు, పెట్టెలతో పాటు పడుకునే పరిస్థితి ఉంది. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు 8గదులు అవసరం కాగా, పాఠశాల మొత్తం కేవలం 7గదులే ఉండడం వల్ల అందులో ఒక గదిలో సరుకు నిలువ చేసుకునే గోదాము, ఇంకొక గదిలో ఉపాధ్యాయుల స్టాఫ్ రూమ్ గానూ, మరో గదిని లేబరేటరీ కోసం వినియోగిస్తున్నారు. దీంతో 175 మంది విద్యార్థులకు సరిపడా గదుల్లేక వరండాల్లో తరగతులు బోధించాల్సిన పరిస్థితిని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్నారు. వీరందరికీ సరిపడేలా మరుగుదొడ్లు ఉన్నప్పటికీ, పడుకునేందుకు గదులు, ఆడుకోవడానికి ఆటస్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల కోసం పంపించిన ఐటిడిఎ డార్మటరీ ఏర్పాటుకు తగిన సౌకర్యం లేకపోవడంతో అవి ఆరు బయటనే ఉంచడంతో పూర్తిగా పాడైపోయే స్థితికి చేరుకున్నాయి. డోకిశిల గిరిజన సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు సరిపడే గదులు ఉన్నప్పటికీ డార్మటరీ సౌకర్యం, వంటగది డైనింగ్ హాలు లేకపోవడంతో ఆరు బయటనే వాటిని కొనసాగించాల్సి వస్తోంది.

ఇక నర్సిపురం బిసి సంక్షేమ వసతి గృహంలో 75 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ వారికి తగినన్ని మరుగుదొడ్లు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. అంతేకాకుండా నర్సిపురం ఉన్నత పాఠశాల ఆవరణలోనే ఈ హాస్టల్ ఉండడం వల్ల దీనికి ప్రహరీ సౌకర్యం లేకపోవడంతో రాత్రిపూట విషసర్పాలు, జంతువులు ప్రవేశించి విద్యార్థులకు హాని కలిగించే పరిస్థితి ఉంది. అరకొర వసతుల ప్రభావం విద్యార్థుల చదువులపై కూడా పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న వసతి సమస్యలతో పాటు ఇతర సమస్యలను అధికారులకు సంబంధిత వసతి గృహ సంరక్షకులు తెలియజేస్తున్నప్పటికీ గత ఐదేళ్ల నుంచి ఎలాంటి స్పందన అధికారుల నుండి రాకపోవడంతో, చాలీచాలని సౌకర్యాలతోనే నెట్టుకు రావలసిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించి రావికొన వసతి గహానికి అదనపు గదులను మంజూరు చేసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని, అలాగే ఇతర వసతిగృహాల్లో ఉన్న సమస్యలను సంబంధిత శాఖలకు చెందిన అధికారులు పరిశీలించి పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



తలుపుల్లేని మరుగుదొడ్లు

హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలి

వసతి గృహాల నిర్వహణలో ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యంతో ఉండడం వల్ల విద్యార్థులు అటు చదువుతో పాటు ప్రాణాలను కూడా కోల్పోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు వసతి గృహాల్లో మౌలిక వసతులు పెంచి విద్యార్థులను ఆకర్షించాల్సిన అధికారులు కనీసం వారికి మౌలిక సదుపాయాలు కల్పించలేకపోవడంతో విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి విద్యార్థుల నిష్పత్తిని బట్టి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు వారికి ఆహ్లాదంకరమైన వాతావరణం కలిగించేలా హాస్టళ్లను తీర్చిదిద్దాలి.

-డి పండు,
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

అర్చకుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని జిల్లాలోని అర్చకులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు స్థానిక కైలాసనాథ ఆలయంలో ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ధూప దీప నైవేద్యాలకు నిధులు కేటాయించాలని, పాడైన దేవాలయాలను మరమ్మతులు చేపట్టాలని, విద్యుత్ బిల్లులు దేవాదాయ శాఖ చెల్లించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అర్చక సంఘం అధ్యక్షులు చదువుల శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి వజిపర్తి రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.పార్వతీశం, బుగత సన్యాసిరావు, ఎం. అచ్యుతరావు, ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

నారాయణరావు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి -పాలకొండ

తెలుగుదేశం పార్టీ నాయకులు, కొండాపురం ఎంపిటిసి సభ్యులు కరణం నారాయణ రావు మృతి చెందిన విషయం తెలుసుకుని బుధవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పరామర్శించారు. పార్టీకి నారాయణరావు మంచి సేవలందించారని కొనియాడారు. అలాగే టిడిపి నియోజకవర్గ ఇన్-ఛార్జ్ పడాల భూదేవి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు సామంతుల దామోదర్ రావు, గుమ్మిడి సింహాద్రి, తదితరులు పరామర్శించారు.

సరుకుల విక్రయానికి మండల కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

నిత్యవసర సరుకుల విక్రయానికి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిత్యావసర సరుకులైన బియ్యం, కంది పప్పు ధరల నియంత్రణకు జిల్లాలో ప్రత్యేక కౌంటర్లను పది రోజుల కిందట పార్వతీపురం, సాలూరు, పాలకొండలో ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 17 నుంచి ఇతర మండల కేంద్రాల్లో ఏర్పాటు చేశామని చెప్పారు. వినియోగదారులకు స్థిరమైన ధరలకు నిత్యావసర వస్తువులను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేశామన్నారు. రెడ్‌గ్రామ్ కంది పప్పు (దేశావళీరకం), బిపిటి / సోనామసూరి ఫైన్ రైస్ (స్టీమ్డ్), బి పి టి / సోనా మసూరి ఫైన్ రైస్ (ముడి) బహిరంగ మార్కెట్లో రూ.181, 55.85, 52.40 ధరలు ఉంటే ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక కౌంటర్లలో రూ.160, రూ.49, రూ. 48కే విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ప్రత్యేక కౌంటర్లను సందర్శించి, విక్రయాలను పర్యవేక్షించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

కురుపాం : బుధవారం స్థానిక రావాడ జంక్షన్ వద్ద పౌర సరఫరా శాఖ సౌజన్యంతో రిటైల్ షాపు వద్ద లభ్యమయ్యే బియ్యం, కందిపప్పు అమ్మే షాపును తహశీల్దార్ బిఎస్ఎస్ సత్యనారాయణ ప్రారంభించారు. సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులు రిటైల్ షాపులు వద్ద లభ్యమవుతున్నాయని, వీటిని వినియోగదారులు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, నాయకులు కర్రి శీను, సురేష్, ఆర్ఐ కరుణాకర్, వీఆర్వో మహేంద్ర పాల్గొన్నారు.

సీతంపేట : పౌర సరఫరాల శాఖ దుకాణం కౌంటర్ స్థానిక బస్టాండ్ వద్ద తహశీల్దార్ మహేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప తహశీల్దార్ మధుసూదన్ రావు, ఆర్ఐ వెంకటేష్, మండల టిడిపి అధ్యక్షులు సవర తోట ముఖలింగం, ఐటిడిపి నియోజవర్గ ఇంచార్జ్ హేమరక పవన్, మండల జనసేన అధ్యక్షులు ఎం.విశ్వనాథం పాల్గొన్నారు.

కొమరాడ : మండల కేంద్రంలో సివిల్ సప్లై ఆధ్వర్యంలో నాణ్యమైన సరుకుల అమ్మకం దుకాణాన్ని ఉప తహశీల్దార్ శివయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో సేల్స్ డిటి, రెవెన్యూ సిబ్బంది, స్థానిక టిడిపి నాయకులు బొంగు భానుజీరావు, బత్తిలి శ్రీనివాసరావు, ప్రజలు పాల్గొన్నారు.



వీరఘట్టంలో ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకులు దుకాణం



కురుపాంలో ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకులు దుకాణం

వీరఘట్టం : మండల కేంద్రంలోని పోలేలమ్మ ట్రేడర్స్‌లో వస్తువులు విక్రయాలను తహశీల్దార్ కె.జయప్రకాష్ ప్రారంభించారు. కార్యక్రమంలో విఆర్ఒ జి.రాజేంద్ర ప్రసాద్, ఉన్నారు.

పాచిపెంట : మండల కేంద్రంలోని చిన్న బజారు వద్ద నిత్యావసర సరుకుల దుకాణాన్ని డిప్యూటీ తహశీల్దార్ ఎం.రాజశేఖర్ ప్రారంభించారు ఈ దుకాణం వద్ద ప్రస్తుతం కిలో కందిపప్పు 160 రూపాయలకి. కిలో సన్న బియ్యం 49 రూపాయలకి విక్రయించారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఎం.రాజశేఖర్, టిడిపి నాయకులు పూసర్ల నరిసింగరావు, ఎంపిటిసి సభ్యులు పల్లెడ ఉమామహేశ్వరరావు, అలజంగి సీతారాం. విఆర్ఒలు, పోలీసులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

ప్రజాశక్తి - పాచిపెంట

మండల కేంద్రమైన పాచిపెంటలో బుధవారం కుక్కల దాడిలో మూడేళ్ల చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. దాసరి వీధికి చెందిన మూడేళ్ల చిన్నారి కె.హాసిని ఇంటి బయట ఆడుకుంటున్న సమయంలో సుమారు ఆరు, ఏడు కుక్కలు గుంపుగా వచ్చి చిన్నారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో చిన్నారి అరుపులు వేయగా చుట్టుపక్కల జనం గమనించి సకాలంలో స్పందించడంతో చిన్నారి ప్రాణాలతో బయటపడింది. వెంటనే స్థానిక పిహెచ్‌సిలో చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం సాలూరు సిహెచ్‌సికి తరలించారు.



కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారి హాసిని

రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలు

భామిని : భామినికి వెళ్లే రోడ్లపై కుక్కలు గుంపులు, గుంపులుగా స్వైరవిహారం చేస్తున్నారు. దీంతో ఈ రోడ్డు గుండా పాఠశాలకు వెళ్లే చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో కుక్కలు దాడి చేస్తున్న వార్తలు నేపథ్యంలో పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలపై కుక్కలు దాడి చేస్తాయేమోనని భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలను పట్టుకుని తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వీధి కుక్కల బారి నుంచి ప్రజలను కాపాడాలి

కొమరాడ : ప్రజలపై దాడి చేస్తున్న వీధి కుక్కల నుంచి ప్రజలను కాపాడాలని సిపిఎం నాయకులు కొన్ని సాంమూర్తి కోరారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజు జిల్లాలో ఏదో ఒక చోట కుక్కలబారిన ప్రజలు పడుతున్నారన్నారు. గుంపు గుంపులుగా వీధి కుక్కలు గ్రామాల్లో తిరుగుతూ ఒంటరిగా కనిపించిన వార్డిపై దాడి చేసే పరిస్థితి ఉందని తెలిపారు. . కావున వెంటనే వీధి కుక్కల నుంచి ప్రజలకు రక్షణ కల్పించేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని, కుక్కకాటు మందులు అందుబాటులో ఉంచాలని కోరారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తులు అరెస్ట్

ప్రజాశక్తి - కొమరాడ

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు కొమరాడ ఎస్సై నీలకంఠం తెలిపారు. మద్యం తరలిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరులకు తెలిపారు. ముందస్తు సమాచారంపై బంగారమ్మపేట దగ్గరలో వాహన తనిఖీ చేస్తుండగా రాయగడ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న టాటా మ్యాజిక్ వాహనంలో వస్తున్న ప్రయాణికులను తనిఖీ చేయగా ఇద్దరి వద్ద ఒడిషాకు చెందిన 4 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయని తెలిపారు. ఇద్దరు వ్యక్తులను, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే అర్తాం జంక్షన్ సమీపాన వాహన తనిఖీ చేస్తుండగా పార్వతీపురం నుంచి సోమినాయుడువలస వైపు వస్తున్న టీవీఎస్ వాహనంపై వస్తున్న వ్యక్తి వద్ద 7 మద్యం బాటిళు లభ్యమవ్వగా, అతడ్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తైక్వాండో పోటీలో క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి- బొబ్బిలి

జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో బొబ్బిలి క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 14న విజయనగరంలో జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. పోటీలలో 13మంది బంగారు, 16మంది రజిత, 19మంది కాంస్య పతకాలు సాధించినట్లు కోచ్ బంకురు ప్రసాద్ చెప్పారు. తైక్వాండోలో ప్రతిభ కనబరిచేలా శిక్షణ ఇస్తున్నట్లు ప్రసాద్ చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే బేబినాయన అభినందించారు. క్రీడలలో విద్యార్థులు, యువత రాణించాలని బేబినాయన కోరారు.

చదరంగంతో మంచి విజ్ఞానం

చదరంగంతో విజ్ఞానాన్ని పెంచుకొవ చ్చునని చెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శ్రీదాడితల్లి కాలనీలో శ్రీపక్యా బుధవారం అండర్-7 జిల్లా చెస్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. జిల్లా స్థాయి పోటీలకు బాలుర విభాగంలో కె.నాగదేవాన్ష్, ఆకుల హిమాంక్ శశ్వత్, బాలికల విభాగంలో ఎన్. ధన్విక, బి. అనన్య ఎంపికైనట్లు కోచ్ ఎం.గణేష్ చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జి.నర్సింగరావు, కిరణ్, గౌతమ్, గణేష్ పాల్గొన్నారు.

జీవవైవిధ్యం పరిరక్షణ బాధ్యత అందరిదీ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

జీవవైవిధ్యం కాపాడే బాధ్యత అందరిపైనా ఉందని రీజనల్ బయోడైవర్సిటీ కోఆర్డినేటర్ జానకీరామ్ అన్నారు. జట్టు నూతన భవనం-తోటపల్లి స్థానిక జట్టు భవనంలో ప్రకృతి వ్యవసాయంపై జరుగుతున్న వర్క్ షాప్‌లో భాగంగా జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షతలో జరిగిన "బడి నుండి పొలం బడికి" రచయితల వర్క్ షాపులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రచయితలను ఉద్దేశించి జానకీరామ్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచి విద్యార్థులకు జీవవైవిధ్యాన్ని కాపాడే వివిధ అంశాలు నేర్పడం ద్వారా భవిష్యత్తులో ప్రకృతిని సంరక్షించుకొనే అలవాట్లు కలుగుతాయన్నారు. దాని ద్వారా జీవవైవిధ్యాన్ని రక్షించవచ్చుని, ఆరోగ్యకరమైన మానవ జీవన విధానాన్ని అలవర్చునని తెలిపారు. బడి నుండి పొలం బడికి వర్క్ షాప్ విధానాన్ని జానకీరామ్ ప్రసంశించారు. అనంతరం డాక్టర్ డి.పారి నాయుడు మాట్లాడుతూ జానకీరామ్ ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఎల్ఎల్‌బి చదివి స్నాతక పట్టాను అందుకోవడం, మొదటిసారి నవ రచయితలను కలవడం సంతోషకరమని తెలిపారు. జానకిరామ్‌ను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు భీమేశ్వరరావు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో బడి నుండి పొలం బడికి సిలబస్ కన్సల్టెంట్ తుంబలి శివాజీ, రైతు వాసుదేవరావు, టి.శివ కేశవరావు, లంక వెంకటస్వామి, పక్కి రవీంద్రనాథ్, బివి పట్నాయక్, కిలపర్తి దాలినాయుడు, పి.గౌరీశ్వరరావు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న సాహితీవేత్తలు, రచయితలు

మరిదే హంతకుడు

రెండురోజుల్లో హత్య కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని గంగాడకు చెందిన గంట సావిత్రమ్మను ఆమె మరిదే హతమార్చినట్టు పోలీసులు తెలిపారు. హత్య జరిగిన రెండు రోజుల్లో కేసు మిస్టరీని పోలీసులు ఛేధించారు. ఈ హత్యకు సంబంధించిన వివరాలను పార్వతీపురం రూరల్ సిఐ కె.రవికుమార్ బుధవారం విలేకరులకు వెల్లడించారు. ఈనెల 12న మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో పొలం పనులకు వెళ్లిన సావిత్రమ్మ ఇంటికి తిరిగి రాలేదని ఆమె మేనల్లుడు హేమసుందర్ ఈనెల 13న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వి.పాపారావు కేసు దర్యాప్తు చేస్తుండగా ఈనెల 14న ఆమె మృతదేహాన్ని గ్రామానికి సమీపంలో ఉన్న రామన్న చెరువులో అగురు గడ్డి పక్కన లభ్యమైంది. ఈనెల 12న పొలం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న వదిన సావిత్రమ్మను హరిబాబు ఆపి ఆమెతో గొడవపడి కర్రతో తలపై కొట్టి హత్య చేశాడు. అనంతరం కొండ రాళ్ల మధ్యలో పడేసి ఒక రోజు వేకువ జామున మృతురాలి మెడకు తన లుంగీ కట్టి చెరువులో ఈడ్చుకొని అక్కడ అగురు గడ్డిలో పడేశాడు. చెరువులో పడి మృతి చెందినట్లు సృష్టించి, తనకు ఏమీ తెలీదన్నట్లు అందరితో మృతదేహాన్ని వెతకడం ప్రారంభించాడు. ఈ మేరకు ఆస్తి తగాదాల కోణంలో పోలీసులు విచారణ చేపట్టగా ఇది హత్యేనని నిర్ధారణకు వచ్చారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐ రవికుమార్

ఆస్తి తగాదాలే హత్యకు కారణం

హరిబాబుకు గ్రామంలో సుమారు రూ.50 లక్షల వరకు అప్పులు ఉన్నాయి. అన్నదమ్ముల వాటా పంపకాల్లో తరచూ గొడవలు వస్తూ ఉండేవి. ఉపాధి పనుల నిమిత్తం మృతురాలి భర్త, కుమారుడు, కుమార్తె హైదరాబాదులో ఉంటు న్నారు. ఎవరూ లేని సమయంలో మరిది ఆమెను ఇలా హత్యకు ప్రణాళిక సిద్ధం చేశాడు.

హత్యేనని తేల్చిన వైద్యులు

మృతదేహాన్ని పోస్టుమార్టంకు పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించిన అనంతరం వైద్యులు సంజీవ నాయుడు ఇది హత్యేనని, ఇందులో ఎటువంటి సందేహం లేదని సిఐ రవికుమార్‌కు తెలపడంతో పోలీసులు ఆ కేసు దర్యాప్తును ముమ్మరం చేస్తున్నారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టగా, స్థానిక విఆర్ఒ రమాశంకర్‌కు లొంగిపోయినట్టు సిఐ తెలిపారు.

నేడు హెల్మెట్ వినియోగంపై ర్యాలీ

బొబ్బిలి: హెల్మెట్ వినియోగంపై గురువారం ర్యాలీ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ చెప్పారు. హెల్మెట్ లేకుండా వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలలో తీవ్రంగా గాయపడి మృతి చెందుతున్నారని, హెల్మెట్ వినియోగం వల్ల కలిగే లాభాలపై వాహనదారులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. ర్యాలీను జయప్రదం చేయాలని ఆమె కోరారు.